BHARATH SAMACHAR DIGITAL

30, సెప్టెంబర్ 2026, బుధవారం

భారత్ సమాచార్

బాహ్య మూల్యాంకన నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: పరీక్ష పత్రాల బాహ్య మూల్యాంకన నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ నెల్లికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో బాధ్యులు యాకయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం

పాఠశాలల్లో రేపటి నుంచి నిర్వహించనున్న సమ్మేటివ్ పరీక్షల పత్రాలను మండల కేంద్రాల్లో మూల్యాంకనం చేయాలని ప్రభుత్వం ఆదేశించడం సరైన నిర్ణయం కాదని సంగ శ్రీనివాస్ అన్నారు. ఈ విధానం వల్ల విద్యార్థులను కేవలం మార్కులు, గ్రేడ్ల కోసం పరుగులు పెట్టించే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. పరీక్షల ఫలితాల కోసం మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించే సంస్కృతి పెరిగే అవకాశం ఉందని ఇప్పటికే విద్యావేత్తలు, ప్రజలు అభిప్రాయపడుతున్నారని తెలిపారు.

విద్యా లక్ష్యాలకు విరుద్ధమైన విధానం

ఇలాంటి నిర్ణయం ప్రాథమిక స్థాయిలో కూడా అదే తరహా ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని సంగ శ్రీనివాస్ అన్నారు. బాహ్య మూల్యాంకన విధానం ఉపాధ్యాయులను కించపరిచే చర్యగా మారుతుందని పేర్కొన్నారు. దీనివల్ల విద్యా వ్యవస్థకు ఎలాంటి ప్రయోజనం లేకపోగా, ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని అన్నారు.

సబ్జెక్టు టీచర్ అందుబాటులో లేకుండానే విద్యార్థి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. విద్య అంటే కేవలం మూల్యాంకనం మాత్రమే అన్నట్లుగా విద్యాశాఖ ఆలోచించడం సరైనది కాదని అన్నారు. ఈ విధానం విద్యా లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు.

నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి

ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాహ్య మూల్యాంకన విధానాన్ని పునఃపరిశీలించాలని సంగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చని ఇలాంటి విద్యా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పద్మావతి, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar